India Media Monitor

# Eminent leaders coming together

## Eenadu

Date: 07/12/2013 | Edition: Hyderabad | Page: 8 | Source: Bureau | Clip size (cm): W: 19 H: 23

Clip: 1 of 1

### దిగ్గజాలంతా

# ఒక్కచోట కలిస్తే..

- యువ పారిశ్రామికవేత్తలకో అరుదైన అవకాశం
- పెట్టుబడుల సమీకరణపై పాఠాలు
- 'టెస్-2013' సదస్సుకు రానున్న ప్రపంచ ప్రముఖులు
- 18 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో సదస్సు

ఈనాడు - హైదరాబాద్

వివిధ రంగాలకు చెందిన దిగ్గజాలు ఒకే వేదికపై కొలువుదీరితే.. అందునా వారి అనుభవాలను యువ పారిశ్రామికవేత్తలకు పంచితే.. అదొక అద్వితీయ అనుభవం. అటువంటి అవకాశమే యువ పారిశ్రామికవేత్తలకు లభించబోతోంది.

ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై) హైదరాబాద్ చాప్టర్ ఈదిశగా వినూత్న ప్రయత్నం చేస్తోంది. యువతకు స్ఫూర్తినిచ్చే లక్ష్యంతో హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల మూడో వారంలో టై ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సు (టెస్- 2103)ను నిర్వహించనుంది. ఈ సదస్సు ఈ నెల 18న ప్రారంభమై 21న ముగుస్తుంది.

నాసా మాజీ ఆస్ట్రోనాట్ బెర్నార్డ్ హారిస్, ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై) వ్యవస్థాపకుడు ఎ.జె. పటేల్, హెలియాన్ వెంచర్ పార్ట్‌నర్స్ ఎండీ ఆశిశ్ గుప్తా, మైక్రోసాఫ్ట్ ఇండియా ఛైర్మన్ భాస్కర్ ప్రామాణిక్, యూటీవీ గ్రూప్ ఛైర్మన్ రోనీ స్క్రూవాలా, మైండ్‌ట్రీ సహ వ్యవస్థాపకుడు సుబ్రతో బాగ్చీ వంటి ప్రముఖులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ఐటీ, ఇన్వెస్ట్‌మెంట్, వెంచర్ కేపిటల్, శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన వీరంతా ఒకే వేదిక మీద కనిపించడమే స్ఫూర్తిదాయకమైన విషయం. వారేం చెబుతారు.. తమతమ రంగాల్లో భవిష్యత్తు పరిణామాలపై ఎలాంటి అంచనాలను వెల్లడిస్తారు. యువతరానికి ఎటువంటి సందేశాన్నిస్తారు.. అనేవి ఆసక్తికరమైన అంశాలుగా ఉంటాయి.

టై సదస్సులో యువ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. వీరందరికీ స్ఫూర్తి కలిగించే విధంగా ఉండాలనే లక్ష్యంతో పలువురు ప్రముఖులను హైదరాబాద్ రావలసిందిగా టై-హైదరాబాద్ చాప్టర్ ఆహ్వానించిందని, అందుకు వారంతా సంసిద్ధత వ్యక్తం చేశారని టై- హైదరాబాద్ అధ్యక్షుడు మురళి బుక్కపట్నం వివరించారు. తత్ఫలితంగా టెస్- 2013 సదస్సు యువ పారిశ్రామికవేత్తలకు అరుదైన అనుభవంగా చిరకాలం నిలిచిపోనుందని అన్నారు.



ఎ.జె.పటేల్
టై వ్యవస్థాపకుడు



ఆశిశ్ గుప్తా
హెలియాన్ వెంచర్ పార్ట్‌నర్స్ ఎండీ



బెర్నార్డ్ హారిస్
నాసా మాజీ ఆస్ట్రోనాట్



భాస్కర్ ప్రామాణిక్
మైక్రోసాఫ్ట్ ఇండియా ఛైర్మన్

### నిధులెలా సమీకరించాలి?

యువ పారిశ్రామికవేత్తలకు ఎన్నో ఆలోచనలు ఉంటాయి. వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలంటే పెట్టుబడి కావాలి. మార్కెట్ ఒరవడులను అర్థం చేసుకోవాలి. వ్యాపారాన్ని సమర్థంగా నిర్వహించటానికి అవసరమైన ఎత్తుగడలు గుర్తించాలి. ఇదంతా తెలియాలంటే, అనుభవజ్ఞులు ఏం చెబుతారో వినాలి. తమ వ్యాపారాలోచనను ఏ విధంగా వివరిస్తే.. ఎలా మాట్లాడితే.. పెట్టుబడి నిధులు లభిస్తాయనేది తెలుసుకోవాలి. వీటన్నింటికీ టెస్-2103 అనువైన వేదిక అవుతుందని మురళి చెప్పారు. మైక్రోసాఫ్ట్ వెంచర్స్ సారథ్యంలో తొలిరోజు ప్రత్యేకంగా 'స్మాష్‌అప్' పేరుతో ప్రత్యేకంగా యువ పారిశ్రామికవేత్తల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తర్వాత రెండు రోజుల పాటు వివిధ అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.ఎం.రావు, మైహోమ్ గ్రూపు వ్యవస్థాపకుడు రామేశ్వరరావులతో పీపుల్ కేపిటల్ భాగస్వామి శ్రీనిరాజు చర్చాగోష్ఠి నిర్వహిస్తారని అన్నారు. రక్షణ రంగంలో దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'ఆఫ్‌సెట్' క్లాజును అమల్లోకి తీసుకువచ్చిన విషయం విదితమే. దీనికింద విదేశీ సంస్థలు మన దేశానికి సరఫరా చేసే రక్షణ ఉపకరణాలు, ఆయుధ సామగ్రిలో 30 శాతాన్ని మన దేశంలోని దేశీ సంస్థల ద్వారా తయారు చేయాలి. ఇది దాదాపు 10 బిలియన్ డాలర్ల వ్యాపారావకాశమని, దీన్ని అందిపుచ్చుకునేందుకు ఇప్పటి వరకూ దేశీయ పరిశ్రమ వైపు నుంచి గట్టి ప్రయత్నం జరగలేదని మురళి బుక్కపట్నం వివరించారు. టెస్-2013 కార్యక్రమంలో భాగంగా ఈ అంశంపై అవగాహన పెంపొందించే ప్రయత్నం చేయనున్నామని ఆయన అన్నారు.

### టై గ్లోబల్ డైరెక్టర్ల బోర్డు సమావేశం

అన్నింటి కంటే ముఖ్యంగా టై గ్లోబల్ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సమావేశం ఇక్కడ జరగనుండటం ఇదే మొదటిసారి. టై వ్యవస్థాపకుడు పటేల్, టై గ్లోబల్ డైరెక్టర్ల బోర్డు ఛైర్మన్ అశోక్‌రావు, సీఈఓ పి.కె.అగర్వాల్, వివిధ టై చాప్టర్ల అధ్యక్షులు ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కలుసుకుంటారు. తద్వారా హైదరాబాద్‌కు విశేష గుర్తింపు లభిస్తుందని మురళి అభిప్రాయపడ్డారు. రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే దిశగా టై -హైదరాబాద్ చాప్టర్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ సమావేశం ఎంతగానో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.